సాక్షి పెద్దపల్లి

శనివారం : 4 : నవంబర్ : 2023

I

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి, మంథని, రామగుండం అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఎన్నికల ప్రక్రియ సజావుగా జరిగేలా అవసరమైన అన్నిఏర్పాట్లు పూర్తిచేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. జిల్లాకు చేరిన ఎన్నికల వ్యయ పరిశీలకులతో ఆయన భేటీ అయ్యారు. పెద్దపల్లి అసెంబ్లీకి ఆశీష్‌యాదవ్, మంథని, రామగుండం నియోజకవర్గాలకు సునీల్ శ్రీవాత్సవ్‌ను ఎన్నికల పరిశీలకులుగా నియమించారు. వారు శుక్రవారం పెద్దపల్లి కలెక్టరేట్‌కు చేరుకుని జిల్లా ఎన్నికల అధికారితో కలెక్టరేట్‌లో సమావేశమయ్యారు.

జిల్లాకు ఎన్నికల వ్యయ పరిశీలకులు



నామినేషన్ల వివరాలు.. 1వ రోజు

నియోజకవర్గం	నామినేషన్లు	సెట్లు
పెద్దపల్లి	01	01
రామగుండం	02	02
మంథని	00	00

న్యూస్‌రీల్

సజావుగా నామినేషన్ల స్వీకరణ



సూచనలిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

మంథని: నామినేషన్ల స్వీకరణ సజావుగా సాగేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్ సూచించారు. స్థానిక రెవెన్యూ డివిజన్ అధికారి కార్యాలయంలోని రిటర్నింగ్ అధికారి ఆఫీస్‌ను కలెక్టర్ శుక్రవారం తనిఖీ చేశారు. హెల్ప్‌డెస్క్, ప్రీ సర్టిఫికేషన్ డెస్క్, నామినేషన్ ఫారం మంజూరు డెస్క్, కంప్యూటర్ డెస్క్ పరిశీలించారు. ఎన్నికల కమిషన్ మార్గదర్శకాల ప్రకారం నామినేషన్ పత్రాలు స్వీకరించాలని సూచించారు. ఆర్డీవో హనుమా నాయక్, మీడియా నోడల్ అధికారి రవీందర్, తహసీల్దార్ రాజయ్య తదితరులు పాల్గొన్నారు.

10వరకు సమర్పించాలి



మాట్లాడుతున్న ఆర్వో అరుణశ్రీ

జ్యోతినగర్(రామగుండం): అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ ప్రక్రియ ఈనెల 10వ తేదీ వరకు కొనసాగుతుందని రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి అరుణశ్రీ తెలిపారు. ఎన్టీపీసీ టీటీఎస్‌లోని జెడ్పీ హైస్కూల్ రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో శుక్రవారం ఎన్నికల నియమావళి –1961లోని 3వ నియమం ప్రకారం నోటిఫికేషన్ విడుదల చేసి మాట్లాడారు. అభ్యర్థి, ప్రతిపాదకులు నవంబర్ 10వ తేదీలోపు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ పత్రాలు సమర్పించాలని సూచించారు. ప్రభుత్వ సెలవు రోజుల్లో నామినేషన్ పత్రాలు స్వీకరించబోమని తెలిపారు. నామినేషన్ పత్రాలు రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని అన్నారు. ఈనెల 13న నామినేషన్లు పరిశీలిస్తామన్నారు. 15న మధ్యాహ్నం 3గంటల్లోగా నామినేషన్ ఉపసంహరణ పత్రాలను అందించాలన్నారు. ఈనెల 30న ఉదయం 7 – సాయంత్రం 5 గంటల మధ్య పోలింగ్ నిర్వహిస్తామని తెలిపారు.

17లోగా ఫీజు చెల్లించాలి

పెద్దపల్లిరూరల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఈనెల 17లోగా పరీక్ష ఫీజు చెల్లించాలని డీఈవో మాధవి కోరారు. రూ.50 అపరాధ రుసుంతో ఈనెల18 నుంచి డిసెంబర్ ఒకటో తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. రూ.200 పెనాల్టీతో డిసెంబర్ 11వరకు, రూ.500 అపరాధ రుసుంతో డిసెంబర్ 12 నుంచి 20 తారీఖు దాకా ఫీజు చెల్లించవచ్చన్నారు. పల్లె ప్రాంత విద్యార్థుల వార్షిక ఆదాయం రూ.20వేలు, పట్టణ ప్రాంతాలవారి వార్షిక ఆదాయం రూ.24వేలు ఉన్నట్లు తహసీల్దార్ నుంచి పొందిన ధ్రువీకరణ పత్రాన్ని సమర్పిస్తే ఫీజులో రూ.125 మినహాయింపు ఉంటుందని డీఈవో వివరించారు.

శరవేగంగా పునరుద్ధరణ



కొనసాగుతున్న పనులు

రామగుండం: పట్టణంలోని బీ థర్మల్ విద్యుత్ కేంద్రంలో పునరుద్ధరణ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. దసరా రోజు షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు చెలరేగి విద్యుత్ ఉత్పత్తి నిలిచిపోయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో మంటలకు ఆహుతైన కేబుళ్లను స్థానంలో కేటీపీఎస్ నుంచి కొత్తవి తెప్పించి అమర్చుతున్నట్లు అధికారులు తెలిపారు. మరోమూడు రోజుల్లో ఉత్పత్తి దశలోకి తీసుకు వచ్చేందుకు ఇంజినీర్లు, అధికారులు కృషి చేస్తున్నారు.

ఆకట్టుకున్న ముగ్గుల పోటీలు



మహిళలతో అధికారులు

కోల్‌సిటీ: రామగుండం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్ అరుణశ్రీ ఆదేశాల మేరకు శుక్రవారం నగరపాలక సంస్థ ఆవరణలో స్వీప్ ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లు, స్వశక్తి మహిళా సభ్యులు పోటాపోటీగా ఆకట్టుకునే ముగ్గులు వేశారు. బల్దియా కమిషనర్ నాగేశ్వర్, స్వీప్ జిల్లా నోడల్ అధికారి రవూఫ్‌ఖాన్, నియోజవర్గ నోడల్ ఆఫీసర్ స్వరూపరాణి, మీడియా కమ్యూనికేషన్ నోడల్ ఆఫీసర్ రజని తదితరులు ముగ్గులు పరిశీలించి ఉత్తమ వాటిని ఎంపిక చేశారు. పోటీల్లో పాల్గొన్న మహిళలను అభినందించారు.

మంచి, చెడు గుర్తించండి



ప్రజాఆశీర్వాద సభకు హాజరైన ప్రజలు



మాట్లాడుతున్న సీఎం కేసీఆర్, వేదికపై డాక్టర్ సంజయ్



సంజయ్ యువసేన కేరింతలు

- కోరుట్ల బిడ్డ సంజయ్‌ను ఆశీర్వదించండి
- ప్రజల కష్టాలు తెలిసినవాడు
- ప్రజా ఆశీర్వాద సభలో సీఎం కేసీఆర్

కోరుట్ల: యువకుడు.. వైద్యుడు.. కోరుట్ల బిడ్డ బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్‌ను ఆశీర్వదించాలని సీఎం కేసీఆర్ కోరారు. శుక్రవారం కోరుట్ల ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడారు. మంచి చెడు ఆలోచించి ప్రజల కష్టాలు తెలిసిన సంజయ్‌కు ఓటేసి గెలిపించాలని కోరారు. పార్టీల చరిత్ర, నడవడిక అధికారంలో ఉన్నప్పుడు ప్రజలకు ఏం సేవ చేశారన్న అంశాలను పరిగణనలోకి తీసుకుని ఓటును సద్వినియోగం చేయాలన్నారు. గతంలో కోరుట్లకు చాలాసార్లు వచ్చానని, ఇక్కడి చేనేత, బీడీ కార్మికుల కష్టాలు తెలుసన్నారు. అందుకే ఎవరు అడగకున్నా చేనేత కార్మికులకు పింఛన్లు, బీడీ కార్మికులకు జీవనభృతి ఇస్తున్నామని వివరించారు. పేదల సంక్షేమం కోసమే బీఆర్ఎస్ ప్రభుత్వం పనిచేస్తుందని, ఆ దిశలో లెక్కలేని పథకాలు అమలు చేస్తున్నామన్నారు. కోరుట్ల సెగ్మెంట్‌లో రెండు రెవెన్యూ డివిజన్లతో పాటు తాను బండలింగాపూర్‌కు వచ్చిన సమయంలో చెరువులు చూశామని, అక్కడి ప్రజలు మండలంగా మార్చాలని కోరితే ఇచ్చామని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో రూ.70 నుంచి రూ.200 పింఛన్ చూశామని, బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే రూ.2వేలు చేశామన్నారు. రానున్న ఐదేళ్ల కాలంలో పింఛన్ ఏడాదికి రూ.500 చొప్పున రూ.5వేలకు చేరుతుందని పేర్కొన్నారు.

సంజయ్ నా ప్రాణాలు కాపాడాడు

కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి డా.సంజయ్ 2009లో తెలంగాణ ఉద్యమంలో భాగంగా చేపట్టిన నిరాహార దీక్ష సమయంలో వైద్యుడిగా తన వెంట ఉండి ప్రాణాలు కాపాడారని సీఎం అన్నారు. యువకుడు, వృత్తిపరంగా వైద్యుడు సంజయ్ తలుచుకుంటే వైద్య వృత్తిలో కోట్ల రూపాయలు సంపాదించవచ్చు, కానీ తండ్రి కోరుట్ల ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు బాటలో ప్రజాసేవ కోసం మీ ముందుకు వచ్చాడు. ఆయనను మీరంతా ఆశీర్వదించిఅక్కునచేర్చుకోవాలని కేసీఆర్ కోరారు.

కేసీఆర్ దీక్ష స్ఫూర్తి: బీఆర్ఎస్ అభ్యర్థి సంజయ్

తెలంగాణ ఉద్యమంలో ఉద్యమ నేత కేసీఆర్ దీక్ష స్ఫూర్తితోనే తాను రాజకీయాల్లోకి వచ్చానని కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ అన్నారు. ప్రజాఆశీర్వాద సభలో ఆయన మాట్లాడుతూ, 'నేను మీ గడ్డ మీద పుట్టిన బిడ్డను.. మీరు పీల్చిన గాలి పీల్చినవాన్ని..మీ కష్టసుఖాల్లో నాన్నతో పాటు పాలుపంచుకున్న.. ఈ ఎన్నికల్లో నన్ను ఆదరించండి' అని కోరారు. కోరుట్లలో వరద కాల్వ లో క్రికెట్ ఆడేవాళ్లం, ఇప్పుడు నిండా నీటితో కళకళలాడుతోందని తెలిపారు. మీకు సీఎం కేసీఆర్ చాలా చేశారు. ఇంకా కొంత మంది బీడీ కార్మికులకు జీవనభృతి రావాలని, వారందరికీ ఇవ్వాలన్నారు. ఎంపీగా బీజేపీ అర్వింద్‌కు అవకాశం ఇచ్చారు. అర్వింద్ ఐదేళ్లలో చేసింది గుండుసున్నా అన్నారు. సభలో ఎమ్మెల్సీలు మధుసూదనాచారి, ఎల్.రమణ, జెడ్పీ చైర్మన్ దావ వసంత, గొడిసెల రాజేశంగౌడ్, ఆర్బీఎస్ జిల్లా అధ్యక్షుడు వెంకట్రావ్, మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ లోక బాపురెడ్డి, మున్సిపల్ చైర్మన్లు అన్నం లావణ్య, రనవేని సుజాత, జెడ్పీటీసీలు దారిశెట్టి లావణ్య, సందిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, కంటాల భారతి, ఎంపీపీలు తోట నారాయణ, మారు సాయిరెడ్డి, కాటిపెల్లి సరోజన, జాజల భీమేశ్వరి, కోరుట్ల పట్టణ, మండల అధ్యక్షులు అన్నం అనిల్, దారిశెట్టి రాజేశ్ తదితరులు పాల్గొన్నారు.

సీఎం సభ సైడ్‌లైట్స్

కోరుట్ల/కోరుట్లరూరల్: కోరుట్ల శివారులో ఏర్పాటు చేసిన సభ ప్రాంగణానికి మధ్యాహ్నం 2 గంటలకే భారీ సంఖ్యలో జనం చేరుకున్నారు.

- సభాప్రాంగణం పూర్తిగా జనంతో నిండిపోవడంతో ఇంకా వేలాది మంది జాతీయ రహదారిపై నిలబడి వీక్షించారు.
- సభలో కళాకారుల ఆటపాటలు ఆకట్టుకున్నాయి.
- ఆర్మూర్ నుంచి సాయంత్రం 4.42 గంటలకు హెలిప్యాడ్‌కు చేరుకున్న కేసీఆర్.. ఆ తర్వాత 4.45 గంటలకు సభాస్థలికి వచ్చారు.
- ముందుగా సభలో ఎమ్మెల్యే కల్వకుంట్ల విద్యాసాగర్‌రావు మాట్లాడి ఒక నిమిషంలోనే ప్రసంగాన్ని ముగించారు.
- తర్వాత కోరుట్ల బీఆర్ఎస్ అభ్యర్థి డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ 4 నిమిషాలు మాట్లాడి పలు సమస్యలను సీఎం దృష్టికి తీసుకొచ్చారు.
- అనంతరం 4.51గంటలకు కేసీఆర్ ప్రసంగం మొదలుపెట్టి 5.08 గంటలకు ముగించారు.
- ప్రసంగం చివరలో ఒక నిమిషం మైనార్టీలను ఉద్దేశించి హిందీలో మాట్లాడారు.
- 5.14 గంటలకు సీఎం కేసీఆర్ హైదరాబాద్‌కు తిరుగు పయనమయ్యారు.

గులాబీ శ్రేణుల్లో జోష్

కోరుట్ల/కోరుట్లరూరల్: ఆశీర్వాద సభ విజయవంతం కావడం బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నింపింది. సభకు సుమారు 70వేల మందిని తరలించాలన్న లక్ష్యంతో ఎమ్మెల్యే విద్యాసాగర్‌రావు, బీఆర్ఎస్ అభ్యర్థి కల్వకుంట్ల సంజయ్ భావించిన మేరకు జనం భారీగా తరలి రావడం గులాబీ శ్రేణులకు కొత్త ఉత్సాహం ఇచ్చింది. కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల నుంచి బస్సుల్లో పెద్ద ఎత్తున జనం రావడంతో జాతీయ రహదారిపై రాకపోకలు స్తంభించాయి. చాలా మంది సభాస్థలికి చేరుకోవడం కష్టంగా మారడంతో బస్సుల్లోనే ఉండి పోయారు. ఏపూరి సోమన్న ఆధ్వర్యంలో కళాకారుల ఆటపాట సభికులను అలరించాయి. సభ ముగిసే సమయంలో గల్ఫ్ వెళ్లి తిరిగివచ్చిన ఓ యువకుడు తమ సమస్యలు ప్రస్తావించలేదని నిరసన తెలిపే ప్రయత్నం చేయగా పోలీసులు సర్ది చెప్పారు. సభ ముగిసిన తరువాత జనం తిరిగి వెళ్లే సమయంలోనూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.

తొలిరోజు మూడు నామినేషన్లు



నామినేషన్ వేస్తున్న వేదభూషణ్



మన్మోహన్..



నామినేషన్ స్వీకరిస్తున్న ఆర్వో మధుమోహన్

- పెద్దపల్లిలో ఒకటి, రామగుండంలో రెండు
- ముహూర్తం కుదరకనే ప్రధాన పార్టీల అభ్యర్థులు దూరం

సాక్షి,పెద్దపల్లి/పెద్దపల్లిరూరల్/గోదావరిఖని: నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైన తొలిరోజు శుక్రవారం ముగ్గురు అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను ఆర్వోలకు సమర్పించారు. రామగుండంలో విద్యార్థుల రాజకీయపార్టీ తరఫున తమ్మెర మన్మోహన్, పిరమిడ్ పార్టీ ఆఫ్ ఇండియా తరఫున పెరుమాండ్ల వేదభూషణ్ తమ నామినేషన్ పత్రాలు దాఖలు చేశారు. పెద్దపల్లిలో బీజేపీ నుంచి అధిష్టానం ఎవరికీ టికెట్ ఖరారు చేయకున్నా ఆ పార్టీ తరఫున నరేశ్‌కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. కొందరు అభ్యర్థులు తమ అనుచరులను ఆర్వో కేంద్రాలకు పంపించి నామినేషన్ పత్రాలు తీసుకున్నారు. మరికొందరు సందేహాలు నివృత్తి చేసుకునేందుకు సహాయ కేంద్రాలకు వెళ్లి వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్, డీసీపీ చేతన ఆర్వో కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

మిగిలింది 6 రోజులే

ఈనెల 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించనున్నారు. ఆదివారం, సెలువు దినాల్లో రిటర్నింగ్ అధికారులు నామినేషన్లు స్వీకరించరు. దీంతో నామినేషన్లు దాఖలు చేయడానికి ఆరు రోజులే మిగిలాయి. ఇందులో మంగళవారం చాలామంది మంచిరోజు కాదన్న అభిప్రాయం ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆరోజు కూడా అభ్యర్థులు నామినేషన్లు వేయకపోవచ్చని తెలుస్తోంది.

9న వేయనున్న అభ్యర్థులు

అభ్యర్థులు ఉత్తర నక్షత్రంతో కూడిన గురువారం, విష్ణు తిథిగా పేర్కొనే ఏకదాశి కావటంతో ఆరోజే నామినేషన్లు వేసేందుకు ప్రధాన పార్టీల అభ్యర్థులు ఆసక్తి చూపుతున్నారు. జిల్లాలోని మూడు అసెంబ్లీలకు బీఆర్ఎస్, కాంగ్రెస్ అభ్యర్థులను ప్రకటించగా, బీజేపీ రామగుండం, మంథని అభ్యర్థులను ప్రకటించగా, పెద్దపల్లి అభ్యర్థిని ప్రకటించాల్సి ఉంది. బీఎస్పీ సైతం మంథని మినహా మిగిలిన రెండు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించింది.

అభ్యర్థుల తప్పుడు వివరాలపై మీరూ ఫిర్యాదు చేయొచ్చు



ఓటు అనేది ప్రతీపౌరుడి హక్కు. మన ఎన్నికల ప్రక్రియ సమగ్రతను కాపాడే బాధ్యత మనదే
– హిల్లరీ క్లింటన్

మీకు తెలుసా..?

కరీంనగర్ అర్బన్: అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ ఘట్టం ప్రారంభం కాబోతుండగా సామాన్యులూ ఎన్నికల క్రతువులో భాగం కావొచ్చు. అభ్యర్థులు నామినేషన్ వేసే సమయంలో తమ విద్య, వ్యాపారం, ఆస్తులు, అప్పులు, నేరచరిత, వారసత్వ సంపదను వారి అఫిడవిట్‌లో పొందుపరచాలి. దీన్ని రిటర్నింగ్ అధికారికి సమర్పించాలి. కొందరు తమ వివరాలను తప్పుగా చూపే అవకాశం కూడా ఉంది. అయితే.. అభ్యర్థులు సమర్పించిన వివరాల్లో ఏమైనా తప్పులు ఉంటే, లేదంటే ఫిర్యాదులు ఉంటే ఎవరైనా తెలియజేయొచ్చు. నేరుగా వారిపై ఫిర్యాదు చేయొచ్చు. అభ్యర్థి తన నామినేషన్ పత్రాన్ని సంబంధిత అధికారికి అందించిన వెంటనే ఆన్‌లైన్ ద్వారా ఎన్నికల సంఘానికి పంపిస్తారు. అనంతరం ఆ కార్యాలయ నోటీస్ బోర్డుపై అభ్యర్థుల అఫిడవిట్ ఉంచుతారు. వీటిని ఎవరైనా పరిశీలించి, సమాచారం తప్పుగా ఉన్నట్లు తెలిస్తే అభ్యంతరాలపై ఎన్నికల రిటర్నింగ్ అధికారికి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయొచ్చు.

స్వేచ్ఛగా ఓటుహక్కు వినియోగం

- సమస్యాత్మక ప్రాంతాల్లో నిఘా తీవ్రతరం
- పాతనేరస్తులపై ప్రత్యేక నజర్
- 'సాక్షి'తో రామగుండం సీపీ రెమా రాజేశ్వరి



గోదావరిఖని: అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని, ఇందుకోసం ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతున్నామని రామగుండం పోలీసు కమిషనర్ రెమా రాజేశ్వర్ తెలిపారు. సాధారణ, సమస్యాత్మక, మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలుగా పోలింగ్ కేంద్రాలను విభజించి బందోబస్తు పటిష్టం చేశామన్నారు. కమిషరేట్ పరిధిలో రామగుండం, పెద్దపల్లి, మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి పూర్తి స్థాయిలో, మంథని, సిర్పూర్, ఖానాపూర్, ధర్మపురి అసెంబ్లీ నియోజకవర్గాలు పాక్షికస్థాయిలో ఉన్నాయని తెలిపారు. శుక్రవారం ఆమె 'సాక్షి'తో మాట్లాడారు. ఆ వివరాలు..

సాక్షి: ప్రశాంత ఎన్నికలకు తీసుకుంటున్న చర్యలేవి?

సీపీ: పోలీస్ కమిషనరేట్‌లో 1,564పోలింగ్ కేంద్రాలు ఉండగా, 237 సమస్యాత్మ, 50మావోయిస్టు ప్రభావిత, 708 సాధారణ పోలింగ్ కేంద్రాలు ఉన్నాయి. ఇక్కడ పోలింగ్ ప్రశాంతంగా జరిగేందుకు 28 ఫ్లయింగ్ సర్వేలెన్స్, 28 స్టాటిటిక్స్ సర్వేలైన్స్ టీంలు ఏర్పాటు చేశాం.

సాక్షి: సమస్మాత్మక ప్రాంతాల్లో ఎలాంటి చర్యలు చేపట్టారు?

సీపీ: సివిల్, హోంగార్డు, పారామిలటరీ బలగాలను మోహరించాం. రాష్ట్ర సరిహద్దు, ఫెర్రీ ప్రాంతాల్లో తనిఖీలు ముమ్మరం చేశాం.

సాక్షి: ఎన్నిచెక్ పోస్టులు ఏర్పాటు చేశారు?

సీపీ: తెలంగాణ, మహారాష్ట్ర సరిహద్దుల్లో ఒక అంతర్‌రాష్ట్ర, తొమ్మిది అంతర్‌జిల్లా చెక్ పోస్టులు ఏర్పాటు చేశాం.

సాక్షి: సువిధ యాప్‌ద్వారా ఎన్ని అనుమతులిచ్చారు?

సీపీ: సువిధ యాప్ ద్వారా అనుమతి కోసం 402 దరఖాస్తులు వచ్చాయి. వీటిలో 360 అర్జీలకు అనుమతి ఇచ్చాం. 38 తిరస్కరించాం. మిగతావి పెండింగ్‌లో ఉన్నాయి.

సాక్షి: మద్యం, నగదు కట్టడికి తీసుకుంటున్న చర్యలు?

సీపీ: గతనెల 9నుంచి ఇప్పటిదాకా తని ఖీలు కొనసాగిస్తున్నాం. పోలింగ్ ముగిసేవ రకూ కొనసాగిస్తాం. ఇప్పటివరకు రూ.3.45 కోట్ల నగదు, రూ.24.58లక్షల విలువైన లిక్కర్, 78గ్రాముల బంగారం, 42కిలోల వెండి, ఇతర వస్తువులు స్వాధీనం చేసుకున్నాం.

సాక్షి: ఎన్ని నామినేషన్ కేంద్రాలున్నాయి?

సీపీ: చెన్నూరు, బెల్లంపల్లిలో తహసీల్దార్ కార్యాలయాలు, రామగుండం ఎన్టీపీసీలో జెడ్పీహెచ్ఎస్, పెద్దపల్లి, మంథని, మంచిర్యాల ఆర్డీవో కార్యాలయాల్లో నామినేషన్ కేంద్రాలు ఉన్నాయి.

సాక్షి: స్ట్రాంగ్ రూంలు ఎన్ని ఏర్పాటు చేశారు?

సీపీ: మంచిర్యాల జిల్లాలో మూడు, పెద్దపల్లి జిల్లాలో మూడు ఏర్పాటు చేశాం. ఈవీఎం, వీవీపాట్లు నిల్వ కేంద్రాలు, స్ట్రాంగ్ రూంలపై సీసీ కెమెరాలతో నిఘా ఉంది.

సాక్షి: కేంద్ర బలగాలు ఎన్నివచ్చాయి?

సీపీ: ప్రస్తుతం 5 సీఆర్‌పీఎఫ్ కంపెనీలు వచ్చాయి. వీరిలో మహిళా బలగాలు కూడా ఉన్నాయి.

ఆదర్శంగా తీర్చిదిద్దుతా

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్

గోదావరిఖని: కారు గుర్తుకు ఓటు వేసి గెలిపిస్తే ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతాతని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్ హామీ ఇచ్చారు. మున్సిపల్ మహిళా కార్మికులతో శుక్రవారం ఆయన సమావేశమైయ్యారు. ప్రజల రుణం తీర్చుకోవడానికి మెడికల్ కళాశాల మంజూరు చేయించానని, ఆరోగ్య మహిళ ద్వారా మహిళలకు ఉచిత వైద్యపరీక్షలు, మెరుగైన వైద్యం అందించేలా కృషి చేస్తున్నామని ఆయన తెలిపారు. ప్రజలు తనకు మద్దతుగా నిలిచి కారుగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. అనంతరం 5వ డివిజన్‌కు చెందిన కాంగ్రెస్ నాయకులు వేముల శంకరయ్య, అడిచెర్ల రాజేశం, భూట్ల శంకర్, కవిత, సావిత్రి, కమల తదితరులు బీఆర్ఎస్‌లో చేరగా.. గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రామగుండం ఎన్నికల ఇన్‌చార్జి నారదాసు లక్ష్మణ్‌రావు, నగర మేయర్ బంగి అనిల్‌కుమార్, నాయకుడు కౌశిక హరి, డిప్యూటీ మేయర్ నడిపెల్లి అభిషేక్‌రావు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలను క్రమబద్ధీకరించిన ఘనత కాంగ్రెస్‌దే..

- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాకూర్



కండువా కప్పుతున్న ఎంఎస్ రాజ్‌ఠాకూర్

గోదావరిఖని: సింగరేణి స్థలాల్లో నిర్మించుకున్న ఇళ్లను క్రమబద్ధీకరించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కిందని ఆ పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి ఎంఎస్ రాజ్‌ఠాకూర్ అన్నారు. 35వ డివిజన్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరగా ఆయన కండువాలు కప్పి ఆహ్వానించారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖరరెడ్డి ఈప్రాంత ప్రజలకు ఇళ్ల పట్టాలు అందించారని గుర్తుచేశారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలు అమలుచేసి పేదలకు న్యాయం చేస్తామని అన్నారు. చేతిగుర్తుకు ఓటు వేసి భారీ మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు. కాగా, సహృదయ ఫౌండేషన్ తరుణ్ ఆధ్వర్యంలో 50 మంది యువకులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. అలాగే పలువురు ఎస్ అండ్ పీసీ సిబ్బంది పార్టీలో చేరగా కండువాలు కప్పి రాజ్‌ఠాకూర్ పార్టీలోకి ఆహ్వానించారు. చేరిన వారిలో కె.శ్రీనివాస్, గులాంరసూల్, అస్లాం, అబ్దుల్‌వహీద్, మౌలానా, అక్బర్, వహీద్, సదానందం ఉన్నారు.

ఆరు అబద్ధాలపై అప్రమత్తంగా ఉండాలి

- బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పుట్ట మధు



ఓట్లు అభ్యర్థిస్తున్న పుట్ట మధు

మంథని: అధికారం కోసం ఆరు అబద్ధాల పథకాలతో కాంగ్రెసోళ్లు వస్తున్నారని, వారితో అప్రమత్తంగా లేకుంటే ఆగమవుతామని మంథని బీఆర్ఎస్ అభ్యర్థి పుట్ట మధు అన్నారు. మున్సిపల్ పరిధిలోని పోచమ్మవాడ, మహాలక్ష్మి దేవాలయం ఏరియా, వడ్లవాడ, ఉస్మాన్‌పుర, సుభాష్‌నగర్, మంత్రివాడ, అంబేడ్కర్‌నగర్, ముత్యాలమ్మ వాడ తదితర ప్రాంతాల్లో శుక్రవారం ఆయన కార్నర్ మీటింగ్‌లలో పాల్గొన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజతో కలిసి మాట్లాడారు. మంథనిలో అత్యధికంగా ఉన్న బీసీలు, కాపులపై కాంగ్రెసోళ్లు కక్ష సాధించారని, మళ్లీ ఓట్లకోసం వస్తున్నారని విమర్శించారు. ఈసారి కూడా పోచమ్మవాడ ప్రజలు ముందుకొచ్చి తనకు మద్దతుగా నిలువడం ఆనందంగా ఉందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే సంక్షేమ పథకాలు అమలు అవుతాయని తెలిపారు. తాను ఎమ్మెల్యేగా గెలిచిన వెంటనే మరిన్ని సొంత పథకాలు అమలు చేస్తానని, పేదలకు ఇళ్ల నిర్మాణాలు, ఆడబిడ్డల వివాహాలు, పేద బిడ్డలకు ఉన్నత చదువులు చదివించే బాధ్యత తీసుకుంటానని ఆయన హామీ ఇచ్చారు. ఈనెల 7న మంథనిలో నిర్వహించే ముఖ్యమంత్రి కేసీఆర్ సభను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

క్లుప్తంగా

టోల్‌ఫ్రీ 1950 నంబరుకు 1,175 ఫిర్యాదులు

పెద్దపల్లిరూరల్‌: జిల్లాలో ఎన్నికల నిబంధనల ఉల్లంఘనలకు సంబంధించి 1950 టోల్‌ఫ్రీ నంబరుకు ఇప్పటివరకు 1,175 ఫిర్యాదులు అందాయని జిల్లా ఎన్నికల అధికారి ముజమ్మిల్‌ఖాన్‌ శుక్రవారం తెలిపారు. ఇప్పటివరకు సివిజిల్‌ యాప్‌ ద్వారా 65 ఫిర్యాదులు అందాయని వివరించారు. వీటితోపాటు తనిఖీల్లో రూ.కోటి2లక్షల26వేల860 నగదు జప్తు చేయగారూ. రూ.కోటిఒక లక్ష66వేల860 విడుదల చేసినట్లు కలెక్టర్‌ పేర్కొన్నారు.

ఎమ్మెల్సీ భానుప్రసాద్‌రావు వాహనం తనిఖీ



వాహనం తనిఖీ చేస్తున్న పోలీసులు

సుల్తానాబాద్‌రూరల్‌: దుబ్బపల్లి చెక్‌పోస్టు వద్ద ఎమ్మెల్సీ తానిపర్తి భానుప్రసాద్‌రావు వాహనాన్ని పోలీసులు శుక్రవారం తనిఖీ చేశారు. కరీంనగర్‌ నుంచి మంచిర్యాలకు వెళ్తున్న ఎమ్మెల్సీ వాహనాన్ని ఎన్నికల నియామవళిలో భాగంగా తనిఖీ చేశామని పోలీసులు తెలిపారు.

ఆర్టీసీ ప్రయాణకులకు తిప్పలు



బస్సుల కోసం నిరీక్షిస్తున్న ప్రయాణికులు

గోదావరిఖనిటౌన్‌: స్థానిక ఆర్టీసీ బస్‌స్టాండ్‌లో శుక్రవారం బస్సుల కొరతతో ప్రయాణికులు ఉదయం నుంచి సాయంత్రం వరకూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గంటల తరబడి బస్సుల కోసం వేచిచూసి చేసేదేమీలేక చివరకు అధిక డబ్బులు చెల్లించి ప్రైవేట్‌ వాహనాలను ఆశ్రయించారు. రాజకీయాల కోసం ఆర్టీసీ బస్సులను వాడుకొని ప్రయాణికులను ఇబ్బంది పెడుతున్నారని తీవ్ర అసహనం వ్యక్తం చేశారు.

రాష్ట్రస్థాయి క్రీడా ఎంపిక పోటీలు



ఎంపికైన క్రీడాకారులు

యైటింక్లయిన్‌కాలనీ: స్థానిక సీఈఆర్‌క్లబ్‌లో శుక్రవారం తెలంగాణ సెస్టోబాల్‌ ఆసోసియేషన్‌ ఆధ్వర్యంలో రాష్ట్రజట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఓసీపీ–1 హెచ్‌డీ బేస్‌ వర్క్‌షాప్‌ జీఎస్‌ నజీర్‌ అహ్మద్‌, సెస్టోబాల్‌ సౌత్‌ జోన్‌ చైర్మన్‌ జక్కుల దామోదర్‌రావు అతిథులుగా హాజరయ్యారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను అభినందించారు. పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు డిసెంబర్‌ 15 నుంచి 17వ తేదీ వరకు పంజాబ్‌లో నిర్వహించనున్న జాతీయ స్థాయిపోటీల్లో రాష్ట్రజట్టుకు ప్రాతినిధ్యం వహిస్తారని క్రీడా నిర్వాహకులు తెలిపారు. ఈకార్యక్రమంలో ఓదెలు యాదవ్‌, సత్యనారాయణ, నవీన్‌, భీమేశ్‌, అంజయ్య, యశ్వంత్‌, స్రవంతి పాల్గొన్నారు.

ఓ కన్నేసి ఉంచారు..!

- మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌, తెలంగాణ సరిహద్దుల్లో నిఘా పటిష్టం
- ఎన్నికలు సజావుగా సాగేందుకు పోలీసుల కట్టుదిట్టమైన చర్యలు
- అటవీ గ్రామాల్లో కూంబింగ్‌.. ప్రత్యేక బలగాల మోహరింపు
- మావోయిస్టుల కదలికలు లేకున్నా ఎల్లవేళలా అప్రమత్తం



కాళేశ్వరం అంతర్‌ రాష్ట్ర వంతెన వద్ద పోలీసులకు సూచనలిస్తున్న ఆ జిల్లా ఎస్పీ కిరణ్‌ ఖరే

మంథని: అసెంబ్లీ ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగేలా పోలీసులు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం కరీంనగర్‌ తూర్పు డివిజన్‌లో మావోయిస్టుల ప్రభావం లేకున్నా ప్రభావిత ప్రాంతాలుగా గుర్తింపు ఉండడంతో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు కట్టుదిట్టమైన చర్యలు చేపట్టారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రాల నుంచి తెలంగాణలోని తూర్పు అడవుల్లోకి మావోయిస్టులు ప్రవేశించకుండా గోదావరి, ప్రాణహిత, ఇంద్రావతి నదుల తీరం వెంట మూడు రాష్ట్రాల పోలీసులు సంయుక్తంగా గాలింపు చేస్తున్నారు.

అడ్డంకులు ఎదురుకాకుండా అప్రమత్తం

- బూటకపు ఎన్నికలు బహిష్కరనే లక్ష్యంగా తమకు పట్టున్న ప్రాంతాల్లో గతంలో విధ్వంసం సృష్టించిన మావోయిస్టులకు.. ఈసారి ఏమాత్రం అవకాశం ఇవ్వరాదనే లక్ష్యంతో పోలీసు వర్గాలు పనిచేస్తున్నాయి.
- 1994 అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మహదేవపూర్‌ మండలం ముకునూరు వద్ద నక్సల్స్‌ ల్యాండ్‌మైన్‌ పేల్చడంతో 8 పంజాబ్‌ కమాండర్లు, ఎస్సై వెంకటస్వామి, ఓ సుంకరి, ట్రాక్టర్‌ డ్రైవర్‌ చనిపోయాడు.
- ఈ దాడిలో ఐజీస్థాయి అధికారి డాక్టర్‌ సాహై చనిపోయారు.
- అలాగే 1999 అసెంబ్లీ ఎన్నికల సమయంలో మహదేవపూర్‌(ప్రస్తుతం పలిమెల) మండలం ముకునూరులో నక్సల్స్‌ పోలింగ్‌ బాక్స్‌లో సిరపోశారు.
- దీంతో అక్కడ రీ పోలింగ్‌ నిర్వహించారు.
- ఆ సందర్భంగా భద్రత కోసం వెళ్తున్న పోలీసులపై వాహనాన్ని మహాముత్తారం మండలం దొబ్బలపాడు కల్వర్టు వద్ద మందుపాతరతో పేల్చడంతో ఇద్దరు పోలీసులు చనిపోయారు.
- ఆ తర్వాత ఎన్నికలు ప్రశాంతంగానే జరిగాయి.
- గత అనుభవాలను దృష్టిలో పెట్టుకున్న పోలీసులు.. ముందస్తుగా తీసుకుంటున్న చర్యలు ప్రతీసారి అనుకూల ఫలితాలేను ఇస్తున్నాయి.
- ఈసారి కూడా హింసాత్మక చర్యలకు తావు లేకుండా నిఘా తీవ్రతరం చేశారు.

చొరబాటు లేకుండా చర్యలు

మంథని నియోజకవర్గానికి తూర్పున గోదావరినదీ తీరంతోపాటు మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ రాష్ట్రాలకు దట్టమైన అటవీ ప్రాంతం సరిహద్దుగా ఉంది. అక్కడి నుంచి కరీంనగర్‌ తూర్పు డివిజన్‌లోకి మావోయిస్టులు చొరబడకుండా పోలీసులు ముందస్తు చర్యలు చేపట్టారు. ఈనెల 30న పోలింగ్‌ ఉన్నందున ఛత్తీస్‌గఢ్‌ నుంచి మావోయిస్టులు చొరబడి కవ్వింపు చర్యలకు పాల్పడతారేమోనన్న అనుమానంతో పోలీసులు విస్తృతంగా తనిఖీలు చేస్తున్నారు. దట్టమైన అడవుల్లో కూంబింగ్‌ చేస్తున్నారు. మావోయిస్టుల కదలికలు కట్టడి చేస్తున్నారు .

ప్రత్యేక బలగాల కోసం పరిశీలన

ఎన్నికల బందోబస్తు కోసం ప్రత్యేక బలగాలను మోహరించేందుకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా కాటారం, మల్హర్‌ మండలాల్లో ఒక బెటాలియన్‌ అందుబాటులో ఉంచేలా ప్రభుత్వ పాఠశాలలను పరిశీలించారు. ఈమేరకు ఏర్పాట్లు చేస్తున్నారు.

59 మావోయిస్టు ప్రభావిత గ్రామాలు

- జయశంకర్‌ భూపాలపల్లి, పెద్దపల్లి జిల్లాలలోని మంథని నియోజకవర్గంలో 288 పోలింగ్‌ కేంద్రాలు ఉన్నాయి.
- ఇందులో 59 మావోస్టు ప్రభావిత గ్రామాలు, 45 సమస్యాత్మక పోలింగ్‌ కేంద్రాలను గుర్తించారు.
- ప్రధానంగా కాటారం మండలంలో 7, మహదేవపూర్‌, పలిమెల మండలాల్లో 9 చొప్పున, మహాముత్తారంలో 7, మల్హర్‌ మండలంలో 8 మావోయిస్టు ప్రభావిత గ్రామాలు ఉన్నట్లు పోలీసు రికార్డుల్లో ఉంది.

బహిరంగ ప్రదేశాల్లో మద్యపానంపై నిషేధం

- అనుమతి లేని డ్రోన్‌, డీజే సౌండ్స్‌పై చర్యలు

గోదావరిఖని: సాధారణ పౌరులు, మహిళలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని రామగుండం కమిషనరేట్‌ పరిధిలోని మంచిర్యాల, పెద్దపల్లి జోన్‌ బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలను పొడిగిస్తున్నామని పోలీస్‌ కమిషనర్‌ రెమా రాజేశ్వరి శుక్రవారం తెలిపారు. మద్యం ప్రియులు పాల్పడుతున్న ఆగడాలపై పలు ఫిర్యాదులు వస్తున్న నేపథ్యంలో ఈ చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. ఈనెలాఖరు వరకు నిషేధాజ్ఞలు అమలులో ఉంటాయన్నారు.

డీజే, డ్రోన్‌లపైనా..

కమిషనరేట్‌ పరిధిలో డీజే సౌండ్స్‌ వినియోగంపై అమల్లో ఉన్న నిషేధాజ్ఞలు పొడిగించినట్లు సీపీ తెలిపారు. చిన్నపిల్లలు, వృద్ధులు, వ్యాధిగ్రస్తులు, విద్యార్థుల విద్యాభ్యాసానికి భంగం కలుగకుండా, శబ్ద కాలుష్యం నుంచి కాపాడేందుకు భారీ సౌండ్‌తో కూడిన డీజే సౌండ్స్‌ వినియోగంపై నిషేధాజ్ఞలు విధించామన్నారు. వివిధ కార్యక్రమాల సందర్భంగా ప్రజల సమీకరణ, ప్రదర్శనల కోసం దీనిని వినియోగిస్తే ఏసీపీల నుంచి అనుమతి పొందాలని సూచించారు. ఈ నెలాఖరు వరకు ఆజ్ఞలు అమలులో ఉంటాయన్నారు.

విద్యార్థులకు నైపుణ్య పరీక్షలు

రామగుండం: ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థుల నైపుణ్య సామర్థ్యాలు గుర్తించేందుకు విద్యాశాఖ శుక్రవారం ప్రత్యేక పరిశీలకుల సమక్షంలో స్టేట్‌ ఎడ్యుకేషన్‌ అచీవ్‌మెంట్‌ సర్వే (ఎస్‌ఈఏఎస్‌) పరీక్షలు నిర్వహించింది. ఇందులో భాగంగా అంతర్గాం, రామగుండం మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మూడు, ఆరు, తొమ్మిదో తరగతి విద్యార్థులకు గుణాత్మక విద్య, నైపుణ్యాలు, విద్యార్థుల సామర్థ్యం తదితర అంశాలపై పరీక్షలు నిర్వహించారు. ఇందులో విద్యార్థుల సామర్థ్యంతోపాటు ఉపాధ్యాయుల పనితీరుపై కూడా స్పష్టత వస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఈ ఫలితాలతో విద్యార్థులస్థాయి సామర్థ్యం, గుణాత్మక విద్యాబోధన తదితర అంశాలపై స్పష్టత రావడంతోపాటు ఉపాధ్యాయుల పనితీరు మెరుగుపరచాల్సిన అవసరం ఉంటుందని పేర్కొన్నారు. వీటన్నింటితోపాటు దేశవ్యాప్తంగా రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలల గ్రేడింగ్‌ గుర్తించే అవకాశం ఉంటుందని ఉపాధ్యాయులు చెబుతున్నారు. కాంప్లెక్స్‌ ఉపాధ్యాయుడు ఏకాంబరం, హెచ్‌ఎం రాచర్ల శ్రీనివాస్‌, దశరథం తదితరులు పరీక్షలు పర్యవేక్షించారు.



పరీక్షలు రాస్తున్న విద్యార్థులు

ఆధ్యాత్మిక చింతనతోనే ప్రశాంతత

జిల్లా పరిషత్‌ చైర్మన్‌ పుట్ట మధు

మంథని: ఆధ్యాత్మిక చింతనతోనే సమాజం బాగుపడుతుందని జిల్లా పరిషత్‌ చైర్మన్‌ పుట్ట మధు అభిప్రాయం వ్యక్తం చేశారు. మర్చిపోయిన.. మారిపోయిన మంథని ప్రాంతంలో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. మంథని శివ కిరణ్‌ గార్డెన్స్‌లో శ్రీజనార్దన సరస్వతీస్వామి సంస్కృతి ట్రస్టు ఆధ్వర్యంలో చేపట్టిన తెలంగాణస్థాయి వేద మహా సభలో శుక్రవారం ఆయన పాల్గొని మాట్లాడారు. వేదాలకు పుట్టినిల్లు మంథనిలో వేదపాఠశాల లేకపోవడంపై ఆలోచన చేయాల్సిన అవసరం ఉందన్నారు. అన్ని కులాలు, మతాలు సమానమని చాటిచెప్పే ముఖ్యమంత్రి కేసీఆర్‌ ఆధ్యాత్మికతకు ప్రాధాన్యత ఇస్తారని తెలిపారు. ఏ కార్యక్రమం చేపట్టినా ముందుగా హోమం నిర్వహించడం ఆనవాయితీ అని అన్నారు. గట్టు నారాయణగురూజీ ఈప్రాంతంపై ఉన్న ప్రేమతో అనేక కార్యక్రమాలు చేపట్టారని ఆయన గుర్తు చేశారు. మున్సిపల్‌ చైర్‌ పర్సన్‌ పుట్ట శైలజతోపాటు తదితరులు ఉన్నారు.

మంటలు అంటుకుని అక్కాచెల్లెళ్లకు గాయాలు

గోదావరిఖని: స్థానిక 7ఎల్‌ఈపీ కాలనీలోని ప్రకాశ్‌పాస్టర్‌ ఇంట్లో శుక్రవారం వంట చేస్తుండగా గ్యాస్‌ రెగ్యులేటర్‌ వద్ద మంటలు చెలరేగి అక్కాచెల్లెళ్లు గాయపడ్డారు. సిలెండర్‌కు ఉన్న రెగ్యులేటర్‌ వద్ద సరిగా లేక మంటలు చెలరేగి సునీత, సుమలత గాయపడ్డారు. సుమారు 40శాతం కాలినగాయాలపాలయ్యారు. వీరిని హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు.

జపాన్‌కు పయనమైన హర్షిత

యైటింక్లయిన్‌కాలనీ: రామగిరి మండలం చందనాపూర్‌ ప్రభుత్వ పాఠశాల పదో తరగతి విద్యార్థి డి.హర్షిత శుక్రవారం జపాన్‌కు బయలుదేరి వెళ్లింది. దాసరి మహేశ్‌–స్వప్న దంపతుల కుమార్తె దాసరి హర్షిత.. గైడ్‌ టీచర్‌ సంపత్‌కుమార్‌ సహకారంతో తను తయారుచేసిన బహుళప్రయోజనకర(హెల్మెట్‌) హెల్మెట్‌ ప్రాజెక్ట్‌ జిల్లా, రాష్ట్రస్థాయి పోటీల్లో ప్రతిభ చూపి అంతర్జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనకు ఎంపికైంది. ఈనెల 5 నుంచి పదో తేదీ వరకు జపాన్‌లోని టోక్యో నగరంలో నిర్వహించనున్న అంతర్జాతీయ వైజ్ఞానిక ప్రదర్శనలో తన ప్రాజెక్ట్‌ ను ప్రదర్శించనున్నట్లు హెచ్‌ఎం లక్ష్మి, గైడ్‌ టీచర్‌ సంపత్‌ కుమార్‌ తెలిపారు. ఈసందర్భంగా హర్షిత మాట్లాడుతూ, అంతర్జాతీయ వేదికపై తన ప్రాజెక్టు ప్రదర్శించడం సంతోషంగా ఉందని పేర్కొంది.



ప్రాజెక్ట్‌తో హర్షిత

చేపలు పట్టేందుకు వెళ్లి మత్స్యకారుడు గల్లంతు

మంథని: ఎక్లాస్‌పూర్‌ గ్రామపంచాయతీ పరిధిలోని నెల్లపల్లికి చెందిన జెట్టి కనుకయ్య (48) కుమ్మరికుంట చెరువులో గల్లంతయినట్లు ఎస్సై కిరణ్‌ శుక్రవారం తెలిపారు. గ్రామానికి చెందిన సిద్దం సమ్మయ్య, జెట్టి కనుకయ్య సమీపంలోని కుమ్మరికుంట చెరువులో చేపలు పట్టేందుకు శుక్రవారం సాయంత్రం వెళ్లారు. సమ్మయ్య తిరిగి రాగా కనుకయ్య రాలేదన్నారు. చీకటి కమ్మివేయడంతో ఆచూకీ కోసం చెరువులో వెతకడానికి అసాధ్యం ఏర్పడుతోంది. ఎస్సై సంఘటనా స్థలానికి వెళ్లి సహాయక చర్యలు చేపడుతున్నారు.

మద్యం అక్రమ తరలింపుపై సమాచారం ఇవ్వండి

మంథని: అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మంథని ఎక్సైజ్‌ సర్కిల్‌ పరిధిలోని మండలాల్లో మద్యం అక్రమ నిల్వలు, తరలింపులపై టోల్‌ఫ్రీ నంబర్‌కు సమాచారం అందించాలని ఎక్సైజ్‌ సీఐ గురువయ్య శుక్రవారం కోరారు. మద్యం వివరాలు తెలుసుకునేందుకు వెరిట్‌ యాప్‌ను మొబైల్‌లో డౌన్‌లోడ్‌ చేసుకొని, మద్యం బాటిల్‌ లేబుళ్ల ద్వారా క్యూఆర్‌ కోడ్‌ స్కాన్‌ చేయాలని సూచించారు. నాటుసారా తయారీ, సరఫరా, అక్రమంగా బెల్లం, పటిక, మద్యం నిల్వవులు, అమ్మకాలు, కల్తీ మద్యం, గంజాయి విక్రయాలపై సమాచారం ఇవ్వాలని కోరారు. జిల్లా అధికారి మహిపాల్‌రెడ్డి నంబర్‌ 87126 58814, మంథని సీఐ గురవయ్య, 87126 58820, ఎస్సై సాయిరాం 81195 36636 నంబర్లకు సమాచారం ఇవ్వాలని కోరారు. రాష్ట్రస్థాయి టోల్‌ఫ్రీ నంబరు 1800 425 2523కు కూడా సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు.

రోడ్డు ప్రమాదంలో సింగరేణి కార్మికుడికి తీవ్ర గాయాలు

యైటింక్లయిన్‌కాలనీ: కాలనీ నుంచి గోదావరిఖనికి వెళ్లే ప్రధాన రోడ్డుపై శుక్రవారం రాత్రి జరిగిన ప్రమాదంలో ఓసీపీ–3 ఈపీ ఆపరేటర్‌ కె.నరేందర్‌ తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికుల కథనం ప్రకారం.. పోతనకాలనికి చెందిన నరేందర్‌ తన బైక్‌పై కాలనీ నుంచి పోతనాకాలనికి వెళ్తున్నాడు. ఈక్రమంలో గోదావరిఖని నుంచి వస్తున్న ఓ కారు ప్రమాదవశాత్తు ఢీకొట్టడంతో నరేందర్‌ అదుపుతప్పి పడిపోయాడు. ఈప్రమాదంలో అతడి తలకు తీవ్రగాయాలు కావడంతో స్పృహ కోల్పోయాడు. స్థానికులు, బ్లూకోల్ట్స్‌ పోలీసులు వెంటనే 108 అంబులెన్స్‌లో గోదావరిఖని సింగరేణి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉండడంతో కరీంనగర్‌లోని మరో ఆస్పత్రికి రెఫర్‌ చేసినట్లు సమాచారం, తమకు ఫిర్యాదు అందలేదని గోదావరిఖని టూటౌన్‌ పోలీసులు తెలిపారు.

జనావాసాల్లోకి కొండచిలువ



యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్‌ 18వ డివిజన్‌ అల్లూరు గ్రామ శివారులో గంగిరెద్దుల వాళ్లు నివాసం ఉండే గుడిసెల్లోకి శుక్రవారం రాత్రి కొండచిలువ చేరింది. అక్కడి కుక్క పిల్లలను మింగేసింది. దానిని చూసిన కొంత మంది కర్రలతో కొట్టడంతో ముళ్లపొదల్లోకి పారిపోయింది. దానిని పట్టుకోవడానికి కార్పొరేటర్‌ భూమయ్య బ్లేడ్‌ ట్రాక్టర్‌ తెప్పించి వెతికించినా దొరకలేదు. దీంతో స్థానికులు భయభ్రాంతులకు గురవుతున్నారు.



మిర్చీలు వేస్తున్న పుట్టమధుకర్‌

మిర్చీలు వేస్తూ.. ఓట్లు అడుగుతూ..

మంథని బీఆర్‌ఎస్‌ అభ్యర్థి పుట్ట మధుకర్‌ ప్రచారంలో దూసుకుపోతున్నారు. సీఎం కేసీఆర్‌ ప్రభుత్వం చేసిన అభివృద్ధి తన విజయానికి సహకరిస్తుందని అంటున్నారు. ఈక్రమంలో కమాన్‌పూర్‌లో మిర్చీబండి వద్ద మిర్చీలు కాల్చుతూ కార్యకర్తలను ఉత్తేజపరుస్తూ, తనకు ఓట్లు వేయాలని ఓటర్లను అభ్యర్థిస్తూ ఇలా కనిపించారు.
– సాక్షి ఫొటోగ్రాఫర్‌, పెద్దపల్లి

కాంగ్రెస్‌ హయాంలోనే స్పిన్నింగ్‌ మిల్లు మూత



రామగుండం: మత పెద్దలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే చందర్‌

- రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌

రామగుండం: కాంగ్రెస్‌ హయాంలోనే అంతర్గాం స్పిన్నింగ్‌ మిల్లులు మూతపడ్డాయని రామగుండం ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ విమర్శించారు. అంతర్గాం టీటీఎస్‌, విలేజీల్లో శుక్రవారం ఆయన రోడ్డు షో నిర్వహించి మాట్లాడారు. సీఎం కేసీఆర్‌ చొరవతోనే అంతర్గాం మండలంగా ఆవిర్భవించిందన్నారు. సంక్షేమ పథకాల లబ్ధిదారులు పిడికిలి పట్టి చెయ్యెత్తి తెలంగాణ పౌరుషం చూపించాలని కోరారు. తనను అధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. జెడ్పీటీసీ ఆముల నారాయణ, ఎంపీపీ దుర్గం విజయ, వైస్‌ ఎంపీపీ మట్ట లక్ష్మి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు తిరుపతినాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

ముస్లిం మతపెద్దలతో భేటీ

పట్టణంలోని మసీదులో ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ ముస్లిం మత పెద్దలతో సమావేశమయ్యారు. సీఎం కేసీఆర్‌ మసీదుల అభివృద్ధి, మత పెద్దలకు గౌరవ భృతి, మైనార్టీలకు సంక్షేమ ఫలాలు బీఆర్‌ఎస్‌తోనే అందుతున్నాయని, మళ్లీ బీఆర్‌ఎస్‌ను గెలిపించాలని కోరారు. బీఆర్‌ఎస్‌ నాయకుడు కౌశిక హరి, కార్పొరేటర్లు ముదాం శ్రీనివాస్‌, సతీశ్‌ కుమార్‌ పాల్గొన్నారు.

ప్రజల రుణం తీర్చుకునేందుకు..

పాలకుర్తి(రామగుండం): ప్రజల రుణం తీర్చుకునేందుకే రామగుండంలో మెడికల్‌ కళాశాల ఏర్పాటు చేశామని ఎమ్మెల్యే కోరుకంటి చందర్‌ అన్నారు. వేంనూర్‌, ఈసాలతక్కళ్లపల్లి, పాలకుర్తి గ్రామాల్లో ప్రజాఅంకితయాత్రలో ఆయన మాట్లాడారు. ఆర్నెళ్లకోసారి మహిళలు ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని, మెడికల్‌ కాలేజీలో వీటిని ఉచితంగా చేస్తున్నారని తెలిపారు. నాయకులు కౌశికహరి, ఎర్రం స్వామి, కోల లత, కొంద్ర చందర్‌, దుర్గం జగన్‌, ఇంజపూరి నవీన్‌కుమార్‌, సర్వర్‌ పాషా, పొన్నం సత్తయ్య, సతీశ్‌, దేవేందర్‌, శ్రీనివాస్‌, కొంరయ్య, నరేశ్‌ పాల్గొన్నారు.

‘పావలా’ రుణాలు ఇచ్చింది కాంగ్రెస్సే



దోశె తింటూ ఓట్లు అడుగుతున్న మక్కాన్‌ సింగ్‌ రాజ్‌ ఠాకూర్‌

- డీసీసీ అధ్యక్షుడు ఎంఎస్‌ రాజ్‌ఠాకూర్‌

యైటింక్లయిన్‌కాలనీ: మహిళలకు పావలా వడ్డీ రుణాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్‌ పార్టీదేనని డీసీసీ అధ్యక్షుడు మక్కాన్‌సింగ్‌ రాజ్‌ఠాకూర్‌ అన్నారు. 15వ డివిజన్‌ కార్పొరేటర్‌ శంకర్‌ నాయక్‌ ఆధ్వర్యంలో శుక్రవారం చేపట్టిన పాదయాత్రలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌ సంక్షేమ పథకాలను పూర్తిస్థాయిలో అమలు చేయకుండా ప్రజలు మోసం చేస్తోందన్నారు. కాంగ్రెస్‌ అధికారంలోకి రాగానే ఆరు గ్యారెంటీలు, ఇతర పథకాలు వెంటనే అమలు చేస్తామన్నారు. చేతిగుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ఆయన కోరారు. అంతకుముందు బైక్‌ ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్‌, శ్రీపాదరావు విగ్రహాలకు పూలమాలవేసి నివాళి అర్పించారు. కాంగ్రెస్‌ జిల్లా వైస్‌ ప్రెసిడెంట్‌ మారెల్లి రాజిరెడ్డి, కాలనీపట్టణ అధ్యక్షుడు గుండేటి రాజేశ్‌, యూత్‌ అధ్యక్షుడు హరిహర నాయక్‌, నాయకులు సారయ్య నాయక్‌, దుర్గప్రసాద్‌, వీరారెడ్డి, తిరుపతి, కేశవులు, చక్రపాణి, అవినాష్‌, సునీత, స్వర్ణలత, స్వరూప, కళవతి, రజియా బేగం పాల్గొన్నారు.

దోశ తిని.. ఓటు అడిగి..

మంథని ఎమ్మెల్యే అభ్యర్థి శ్రీధర్‌బాబుకు మద్దతుగా రామగుండం ఎమ్మెల్యే అభ్యర్థి మక్కాన్‌సింగ్‌ రాజ్‌ఠాకూర్‌ రామగిరి మండలం కేకేనగర్‌, షాపింగ్‌ కాంప్లెక్స్‌లో ప్రచారం చేశారు. ఈక్రమంలో ఓ హోటల్‌ వద్ద నాయకులతో కలిసి దోశ తిని, టీ తాగి ఓటువేయాలని కోరారు. నాయకులు ఉన్నారు.

వ్యాపారుల సమస్యలు పరిష్కరిస్తా



పాదయాత్ర చేస్తున్న బీజేపీ అభ్యర్థి సంధ్యారాణి

- బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి కందుల సంధ్యారాణి

గోదావరిఖని: తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే వ్యాపారుల సమస్యలు పరిష్కరిస్తానని రామగుండం బీజేపీ అభ్యర్థి కందుల సంధ్యారాణి హామీ ఇచ్చారు. శుక్రవారం కల్యాణ్‌నగర్‌, లక్ష్మీనగర్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వ్యాపారులను కలుస్తూ బీజేపీకి ఓటువేసి ఒక్క అవకాశం కల్పించాలని అభ్యర్థించారు. ఇప్పటివరకు గెలిచిన నాయకులు పట్టించుకోక పోవడంతో ఎంతోమంది వ్యాపార, వర్తకులతోపాటు ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. చిన్న వర్షాలకే రోడ్లు జలమయం కావడంతో షాపింగ్‌కు వెళ్లాలంటే భయపడుతున్నారని విమర్శించారు. లక్ష్మీనగర్‌, కల్యాణ్‌నగర్‌ ప్రాంతాల్లో కనీసం రోడ్లు కూడా లేని పరిస్థితులు నెలకొన్నాయని ఆమె అన్నారు.

సాక్షి ఫ్యామిలీ
కరీంనగర్
శనివారం ॥ 4-11-2023

ఒకప్పుడు రేడియోలో పాటలు వింటూ, ఆ తర్వాత టీవీలో సీరియల్స్ చూస్తూ గంటలు గంటలు గడిపేసేవాళ్లు. ఇప్పుడంతా స్మార్ట్‌ఫోన్ల మయం అయిపోయింది. దీంతో ఇన్‌స్టా, ఫేస్‌బుక్, టిక్‌టాక్, మోజ్ మొదలైన సోషల్ మీడియా యాప్స్‌లో వచ్చే రీల్స్‌ను తెగ చూస్తున్నారు. గంటలకొద్దీ వీటినే చూస్తుండిపోతున్నారు. కొంతమందికి ఇది వ్యసనంలా మారితే, మరికొంతమంది బానిసలైపోయారు. ఇది ఆరోగ్యానికి అంతమంచిది కాదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొంతమంది రీల్స్ చూడడం మానేయాలనుకున్నప్పటికీ మానలేక తెగ ఇబ్బంది పడుతున్నారు. ఇటువంటి వారు ఈ కింది చిట్కాలను పాటిస్తే రీల్స్ జోలికి పోకుండా ఉండవచ్చు. అవేంటో చూసేయండి...

రీల్స్ నుంచి రిలీజ్ అవండి ఇక



● వినోదం కోసం రీల్స్ చూస్తుంటారు. ఇది వ్యసనంగా మారుతుంది కాబట్టి ఈ ఎంటర్‌టైన్మెంట్‌ను మార్చుకోవాలి. మీకు దొరికే కొద్దిపాటి సమయాన్ని మీ స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి గడపండి. మీకు ఇష్టమైన ఆటలు ఆడడం లేదా మీ హాబీలను పంచుకుంటూ సరదాగా గడపాలి. ఇలా చేయడం వల్ల కొంత సమయం మీ ఫోన్‌కు దూరంగా ఉంటారు. ఫలితంగా రీల్స్ చూడాలనిపించదు.

● వారాంతాలు, సెలవులు, ఖాళీ సమయాల్లో మొబైల్‌ఫోన్‌కు దూరంగా ఉండండి. ఇలాంటి సమయాల్లో పార్కుకెళ్లి సరదాగా నడవడం, గార్డెన్ పనులు చేయడం, కుటుంబ సభ్యులతో కలిసి సినిమా చూడడం వంటివి చేయాలి. వీటిలో ఏది చేసినా విలువైన మీ సెలవు దినం వృథా కాకపోవడంతోపాటు మీ సన్నిహితులతో కలిసి సంతోషంగా గడుపుతూ వారికి మరింత దగ్గరవుతారు.

● మీ ఫోన్లో నోటిఫికేషన్స్‌ను ఆపేయాలి. టిక్‌టిక్ అంటూ పదేపదే వచ్చే నోటిఫికేషన్స్ రీల్స్ చూడాలని మెదడుని ప్రేరేపిస్తాయి. మీకు తెలియకుండానే రీల్స్ ఓపెన్ చేసి గంటలకొద్దీ వాటిలో మునిగి పోతుంటారు. అందుకే రీల్స్ నోటిఫికేషన్స్ ఆపేయడం ఉత్తమం.

● ఫోన్‌ను ఎంతసేపు చూడాలనేది మీ నియంత్రణలో ఉండాలంటే అలారం పెట్టుకోండి. మీరు ఫోన్‌లో మునిగిపోయి ఉన్నప్పుడు అలారం హెచ్చరికతో తేరుకుని నియంత్రణలో ఉండగలుగుతారు.

● ఇవన్నీ చేసినప్పటికీ రీల్స్‌ని చూడకుండా ఉండలేకపోతే... రీల్స్ వచ్చే అన్ని అప్లికేషన్లు లేదా యాప్స్‌ను శాశ్వతంగా తీసేయండి. అప్పుడు చూడాలనిపించినా అవి ఉండవు కాబట్టి మిమ్మల్ని మీరు నియంత్రించుకో గలుగుతారు. ఇవి లేనప్పుడు వేరే కొత్త హాబీ మీ రోజువారీ దినచర్యలో భాగం అవుతుంది. తద్వారా ఆరోగ్యకరమైన, సంతోషంతో కూడిన మార్పులు చోటుచేసుకుని ఆత్మస్థైర్యం పెరుగుతుంది. ప్రయత్నించి చూడండి.

సీజనల్ వ్యాధులు
సురక్షితం ఇలా!



గత కొద్దిరోజులుగా రెండు తెలుగు రాష్ట్రాలలోనూ ఇంచుమించు ప్రతి ఇంట్లోనూ దగ్గు, జలుబు, తుమ్ములు, జ్వరం వంటి వాటితో ఎవరో ఒకరు బాధపడుతూనే ఉన్నారు. సీజనల్ వ్యాధుల విజృంభణే అందుకు కారణం. ఇది ప్రతి సీజన్‌లోనూ ఉండేదే అయినా, ఒక్కొక్కరికి ఒక్కో సీజన్ బొత్తిగా పడదు. అందువల్ల వచ్చాక బాధపడేకంటే వీటిని నివారించుకోవడమే ఉత్తమం. సీజనల్ వ్యాధులను నివారించుకోవడం ఎలాగో తెలుసుకుందాం...

కొన్ని నివేదికల ప్రకారం, గత సంవత్సరంతో పోలిస్తే ఈ ఏడాది సీజనల్ వ్యాధుల కేసులు గణనీయంగా పెరిగినట్లు గణాంకాలు చెబుతున్నాయి. శ్వాసకోశ ఇన్ఫెక్షన్లలో పెరుగుదల ఉన్నట్లు వైద్యనిపుణులు గుర్తించారు. ముఖ్యంగా పట్టణాలలో ఈ సమస్యలు అధికంగా ఉన్నాయి. వాయుకాలుష్యమే ఇందుకు ప్రధాన కారణం.

ఎలా నివారించాలి?

● శరీరంలో రోగనిరోధక వ్యవస్థ బలహీనపడటం వల్లే ఈ తరహా సీజనల్ ఇన్ఫెక్షన్లు దాడి చేస్తుంటాయి. ఈ సమస్యల నుండి బయటపడాలంటే బలమైన రోగనిరోధక వ్యవ్యస్థను కలిగి ఉండటం ఒక్కటే మార్గం.

● రోగనిరోధక వ్యవస్థను బలపరుచుకోవాలంటే... ఆహారంలో వివిధ రకాల పండ్లు, కూరగాయలు, ప్రోటీన్లు, తృణధాన్యాలు ఉండేలా చూసుకోవాలి.



మంచి పోషకాహారం తీసుకునే వారికి అంటు వ్యాధులు సోకే ప్రమాదం తగ్గుతుంది.

● వ్యాయామం రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడమే కాకుండా ఒత్తిడిని తగ్గిస్తుంది కాబట్టి ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు వారానికి కనీసం 150 నిమిషాలకు తగ్గని శారీరక వ్యాయామం అవసరం.

● **తగినంత నిద్ర**
నిద్ర లేకపోవడం శరీరానికి రక్షణగా ఉండే రోగనిరోధక వ్యవస్థను బలహీనపరుస్తుంది. శరీరానికి తగినంత రోగనిరోధక శక్తి కలగాలంటే రోజూ కనీసం ఆరున్నర నుంచి 8 గంటల రాత్రి నిద్ర అవసరం. రాత్రిళ్లు డ్యూటీ చేసేవారు పగలు మరింత ఎక్కువ సమయాన్ని నిద్రకు కేటాయించాలి.



● **ఫ్లూ టీకాలు**
ఫ్లూ నుంచి రక్షణ పొందేందుకు ప్రతి ఏడాది టీకాలు తీసుకోవడం అవసరం. ఇలా టీకాలు తీసుకోవటం వల్ల ఫ్లూ ప్రమాదాన్ని తగ్గించుకోవచ్చు.

● **పరిశుభ్రతను పాటించడం**
ఏదైనా వస్తువులను, బహిరంగ ప్రదేశాలను తాకిన తరువాత కనీసం 20 సెకన్ల పాటు సబ్బుతో చేతులను కడగాలి.

● **తగినంత దూరం పాటించడం**
తెలిసిన వ్యక్తులు, సన్నిహితులు అనారోగ్యంతో ఉన్నప్పుడు వారిని పలకరించండి. చూడటానికి వెళ్లండి కానీ సురక్షితమైన దూరం పాటించటానికి ప్రయత్నించడాన్ని మాత్రం మరచిపోరాదు.

● సీజనల్ వ్యాధులలో వైరస్, బాక్టీరియా, ఫంగస్ కారణంగా వచ్చే సైనసైటిస్ వల్ల ముక్కుతోపాటు గొంతు సంబంధిత సమస్యలు ఏర్పడతాయి. తలనొప్పి కూడా వస్తుంది. వచ్చిందంటే ఒకపట్టాన వదలకుండా కొన్ని రోజులపాటు పట్టి పీడించే ఈ వ్యాధి నుంచి బయటపడేందుకు చిన్న చిన్న చిట్కాలు ఎంతగానో దోహదపడతాయి.

● ఉల్లి, వెల్లుల్లి రేకులను తింటే సైనసైటిస్ బాధ తగ్గుతుంది. వంటకాల్లో ఉల్లి, వెల్లుల్లి విరివిగా వాడితే మంచిది.

● టీ స్పూన్ జీలకర్రను వేయించి పొడిచేసి, అందులో రెండు స్పూన్ల తేనె కలిపి రోజుకు రెండుసార్లు తీసుకుంటే మంచి ఫలితం కనిపిస్తుంది. జీలకర్రను పల్చని కాటన్ వస్త్రంలో కట్టి వాసన పీల్చాలి.

● గ్లాసున్నర నీళ్లలో టీ స్పూన్ మెంతులను వేసి బాగా మరిగించి కషాయం కాయాలి. ఈ కషాయాన్ని రోజుకు నాలుగుసార్లు తీసుకోవాలి.

● క్యారట్ జ్యూస్‌లో పాలకూర రసం కలిపి రోజుకు ఒకసారి తాగాలి.

ఇలా చేయడం వల్ల సీజనల్ వ్యాధుల నుంచి సురక్షితంగా బయట పడవచ్చు.

చిక్కుళ్లు తింటే అనారోగ్యానికి చిక్కరు



ఈ సీజన్‌లో అంటే చలి కాలంలో విరివిగా దొరికే చిక్కుళ్లను మన ఆహారంలో చేర్చుకుంటే శరీరానికి అనేక ఆరోగ్య ప్రయోజనాలు కలుగుతాయి. ఎందుకంటే చిక్కుడు కాయలలో అనేక పోషకాలు ఉంటాయి. ఎంతో రుచిగా ఉండే చిక్కుడు కాయలు తింటే కలిగే ఆరోగ్య ప్రయోజనాలేమిటో తెలుసుకుందాం...

★ చిక్కుడుకాయలలో మెగ్నీషియం, ఐరన్, ఫాస్ఫరస్, జింక్, పీచు పదార్థాలు, క్యాల్షియం, ఫోలిక్ యాసిడ్, మాంసకృత్తులు వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. వీటితోపాటు యాంటీ ఆక్సిడెంట్లు, విటమిన్లు కూడా ఉంటాయి.

★ వీటిని కూరల రూపంలో లేదా గింజలను ఉడికించి తినడం ద్వారా... ఇలా ఏదో ఒక విధంగా రెగ్యులర్ గా తీసుకుంటే ఆరోగ్యానికి మంచిది. ఇవి శరీరానికి తగిన శక్తిని అందించి వ్యాధులతో పోరాడే సామర్థ్యాన్ని పెంచి రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఇవి హృద్రోగాలు, క్యాన్సర్ వంటి సమస్యను కూడా దూరం చేస్తాయి.

★ చిక్కుడుకాయలలో ఉండే క్యాల్షియం, విటమిన్ డి ఎముకలకు వల్ల ఎముకలు దృఢంగా మారుతాయి. గర్భిణులు, బాలింతలు, వ్యాయామం చేసేవారికి చిక్కుళ్లు చాలా మంచిది.

చిక్కుడుకాయలు దొరకనప్పుడు ఎండిన చిక్కుడు గింజలను కూడా కూరల్లో ఉపయోగించవచ్చు. బరువు తగ్గాలనుకునే వారు వారి డైట్‌లో చిక్కుడుకాయలను చేర్చుకోవడం ఉత్తమం.

★ చిక్కుడు కాయలను తింటే ఆకలి తగ్గుతుంది. ఫలితంగా బరువు నియంత్రణలో ఉంటుంది. వీటిలో ఉండే పీచు పదార్థం జీర్ణవ్యవస్థ ఆరోగ్యంగా ఉండేలా చేయడంతో పాటు పేగు క్యాన్సర్లు రాకుండా చూస్తుంది. డయేరియా, మధుమేహం, కొలెస్ట్రాల్ వంటి సమస్యలు దరి చేరవు. చిక్కుళ్లలో ఉండే యాంటీ ఆక్సిడెంట్లు వృద్ధాప్యం కారణంగా వచ్చే అనేక వ్యాధులను నివారిస్తాయి.

★ చిక్కుడు కాయలలో ఉండే విటమిన్లు గుండె ఆరోగ్యానికి దోహదపడతాయి. సెలీనియం, మాంగనీస్ వంటి ఖనిజాలు చిక్కుడు కాయలలో సమృద్ధిగా ఉంటాయి. ఇవి ఊపిరితిత్తుల సమస్యలను నివారించడానికి, దీర్ఘకాలిక శ్వాస సంబంధిత సమస్యలను తగ్గించడానికి దివ్యౌషధంగా సహాయపడతాయి. ఇందులో ఉండే మాంగనీస్ నిద్రలేమి సమస్యలను తగ్గించడానికి సహాయపడుతుంది.

★ చిక్కుడు కాయలలోని అమైనో ఆమ్లాలు హార్మోన్ల సమతౌల్యానికి సహాయపడతాయి. దీంతో మానసిక ఆందోళన, టెన్షన్ వంటి సమస్యలు తగ్గుతాయి. అలాగే ఇందులో ఉండే పొటాషియం కండరాల వృద్ధికి సహాయపడుతుంది. అంతేకాదు, మెదడు పనితీరును మెరుగుపరిచి జ్ఞాపకశక్తిని పెంచుతుంది.

ఇన్ని ప్రయోజనాలుండే చిక్కుళ్లను తీసుకోవడం అలవరచుకుంటే అనారోగ్య సమస్యలకు దూరంగా ఉండి ఆరోగ్యంగా ఉండవచ్చు.

హెల్త్ టిప్స్



* ఎండలో ఎక్కువ సేపు తిరగడం వల్ల తలనొప్పి వచ్చినా తల తిరిగినట్లుగా ఉన్నా చిన్న అల్లం ముక్కను నూరి నిమ్మరసంలో కలిపి తాగితే వెంటనే ఉపశమనం కలుగుతుంది.
* ముక్కు దిబ్బెడ వేసినప్పుడు ఒక చుక్క ఉల్లిరసాన్ని ముక్కు రంధ్రాల్లో వేస్తే ఉపశమనం కలుగుతుంది.
* సగానికి కోసిన నిమ్మచెక్కపై ఉప్పు, మిరియాల పొడి చల్లి కొద్దిగా వేడి చేసి రసం పిండుకొని తాగితే మైగ్రెయిన్ తలనొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.
* నిమ్మరసం, తేనె, గ్లిసరిన్ సమపాళ్లలో కలిపి చెంచా చొప్పున రోజుకు మూడుసార్లు తీసుకుంటే దగ్గు తగ్గుతుంది.
* నిద్రలేమితో బాధపడుతున్న వారు పడుకునే ముందు కొత్తిమీర రసం, పంచదార కలిపిన నీళ్లను తాగితే ఫలితం ఉంటుంది.
* రక్తంలోని కొలెస్ట్రాల్‌ను తగ్గించుకొని సన్నబడాలంటే రోజూ పెరుగును తీసుకోవాలి.
* గుండె ఆరోగ్యంగా ఉండాలంటే కొవ్వు పదార్థాలు తక్కువ వుండే ఆహారపదార్థాలు తీసుకోవాలి.
* మధుమేహంతో బాధపడేవారు నిత్యం ఆహారంలో ఉల్లి, వెల్లుల్లి ఉండేలా చూసుకుంటే ఎంతో మేలు.
* రాత్రి 7 నుంచి 8 గంటల లోపు ఆహారం తీసుకోవడం, తిన్న తరువాత కనీసం ఒక అరగంట నాటి అయినా నడవడం అలవాటు చేసుకోవడం వల్ల అరుగుదల బాగుండడంతో పాటు ఇతర ఆరోగ్య సమస్యలు కూడా దరిచేరకుండా ఉంటాయి.

సినిమా

భారతీయుడు ఈజ్ బ్యాక్


● కమల్‌హాసన్

''హలో... ఏ తప్పు జరిగినా నేను తప్పకుండా వస్తాను. భారతీయుడుకి చావే లేదు' అంటూ 'ఇండియన్' ('భారతీయుడు') చిత్రం చివర్లో కమల్‌హాసన్ చెప్పే డైలాగ్‌తో 'ఇండియన్ 2' ('భారతీయుడు 2') ఇంట్రో గ్లింప్స్ మొదలవుతుంది. కమల్‌హాసన్ హీరోగా శంకర్ దర్శకత్వంలో రూపొందిన 'ఇండియన్' (1993)కి సీక్వెల్‌గా 'ఇండియన్ 2' తెరకెక్కుతోంది. కాజల్ అగర్వాల్ హీరోయిన్‌గా నటించిన ఈ చిత్రంలో సిద్ధార్థ్, ప్రియా భవానీ శంకర్, రకుల్ ప్రీత్ సింగ్, ఎస్‌జే సూర్య, బాబీ సింహా కీలక పాత్రధారులు. సుభాస్కరన్, ఉదయ నిధి స్టాలిన్ నిర్మిస్తున్నారు. శుక్రవారం 'ఇండియన్ 2' ఇంట్రో గ్లింప్స్ వీడియోను రిలీజ్ చేశారు. ''భారతీయుడు ఈజ్ బ్యాక్' అంటూ 'ఇండియన్ 2' తెలుగు వెర్షన్ గ్లింప్స్‌ను దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి షేర్ చేశారు. ఈ వీడియోలో 'నమస్తే ఇండియా.. భారతీయుడు ఈజ్ బ్యాక్' అంటూ కమల్‌హాసన్ చెప్పిన డైలాగ్ ఉంటుంది.

నన్ను తమిళ అబ్బాయిలా ఉన్నావనేవారు
- నాని


● ఎస్ఆర్ ప్రభు, రాజు మురుగన్, కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్, నాని, వంశీ పైడిపల్లి

''ఈగ సినిమా తమిళంలో విడుదలైన తర్వాత నేను ఎప్పుడు చెన్నై వెళ్లినా.. నన్ను తమిళ అబ్బాయిలా ఉన్నావనేవారు. అలాగే కార్తీని చూస్తే చాలామంది తెలుగు ప్రేక్షకులు తెలుగబ్బాయిలా ఉన్నాడంటారు. నాకు తెలిసి తెలుగు ప్రేక్షకులు కార్తీని సొంతం చేసుకున్నారు. వరుసగా మూడు హిట్స్ సాధించి ఇప్పుడు 'జపాన్'తో ముందుకొస్తున్నాడు కార్తీ. దీపావళికి వస్తున్న ఈ సినిమా పెద్ద విజయం సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను'' అని హీరో నాని అన్నారు. కార్తీ, అనూ ఇమ్మాన్యుయేల్ జంటగా నటించిన చిత్రం 'జపాన్'. రాజు మురుగన్ దర్శకత్వంలో ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మించిన ఈ సినిమా పాన్ ఇండియా స్థాయిలో ఈనెల 10న విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన ఈ చిత్రం ప్రీ రిలీజ్ వేడుకకి ముఖ్య అతిథిగా హాజరైన **నాని మాట్లాడుతూ** – ''జపాన్' లాంటి చిత్రం తీసి ప్రేక్షకుల్ని మెప్పించడం అంత సులభం కాదు. కానీ, ఈ మూవీ ట్రైలర్ చూశాక టీమ్ ఎనర్జీ, నమ్మకం నాకు కనిపించింది. అనూ ఇమ్మాన్యుయేల్ నా 'మజ్ను' సినిమాతో పరిచయమైంది. 'జపాన్' ట్రైలర్ చూసినప్పుడు చాలా మంచి సినిమాలో భాగస్వామ్యం అయినట్లు అనిపించింది. ప్రభుగారు మంచి సినిమాలు నిర్మిస్తుంటారు. లెక్కలు చూసుకుని పని చేసే నిర్మాత కాదు.. ప్యాషన్‌తో, ప్రాణం పట్టి పనిచేసే నిర్మాతలాగా అనిపిస్తారు. ఇలాంటి మంచి సినిమా తీసిన డైరెక్టర్ రాజు మురుగన్‌కి అభినందనలు'' అన్నారు. ''జపాన్' నా మనసుకు బాగా దగ్గరైంది'' అన్నారు **కార్తీ**. ''జపాన్' అంతా రాజు మురుగన్ శైలిలో ఉంటుంది. ఈ సినిమా ప్రేక్షకులను నిరుత్సాహ పరచదు. అన్నపూర్ణ స్టూడియోస్ భాగస్వామ్యంలో తెలుగులో ఈ సినిమా విడుదల చేస్తుండటం సంతోషంగా ఉంది'' అని **ఎస్ఆర్ ప్రభు** అన్నారు. **రాజు మురుగన్ మాట్లాడుతూ**– ''కళకు భాషతో సంబంధం లేదు. తెలుగు ప్రేక్షకులు సినిమాని పండగలా సెలబ్రేట్ చేసుకుంటారు. భారతీయ సినిమాకి ఐకానిక్‌గా గుర్తింపు పొందింది టాలీవుడ్'' అన్నారు. ఈ వేడుకలో నిర్మాత సుప్రియ, దర్శకుడు వంశీ పైడిపల్లి, నటులు సునీల్, రాకేందు మౌళి, పాటల రచయిత భాస్కరభట్ల తదితరులు పాల్గొన్నారు.

ఏడాదిగా ఆమె నాకోసం కష్టపడుతున్నారు
- సమంత



''చెడుపై మంచి సాగించే అంతిమ యుద్ధంలో ఈసారి ఒకరు కాదు ముగ్గురు సూపర్ హీరోలు పోరాడుతున్నారు. ఈ దీపావళికి యాక్షన్ ప్యాక్డ్ రైడ్‌లా వస్తున్న 'ది మార్వెల్స్' సినిమా చూడటానికి ఉత్సాహంగా ఎదురు చూస్తున్నా'' అన్నారు హీరోయిన్ సమంత. మార్వెల్ సినిమాటిక్ యూనివర్స్‌లో భాగంగా 'కెప్టెన్ మార్వెల్'కు సీక్వెల్‌గా నియా డకోస్టా దర్శకత్వంలో 'ది మార్వెల్స్' రూపొందింది. కెప్టెన్ మార్వెల్‌గా బ్రీ లార్సన్, మిస్ మార్వెల్‌గా ఇమాన్ వెల్లనీ, మోనికాగా తెయోనా పారిస్ నటించారు. మార్వెల్ స్టూడియోస్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 10న తెలుగు, ఇంగ్లిష్, హిందీ, తమిళ భాషల్లో ఇండియాలో విడుదలవుతోంది. ఈ సందర్భంగా శుక్రవారం 'ది మార్వెల్స్' ప్రోమోను రిలీజ్ చేసిన సమంత మాట్లాడుతూ– ''మహిళా శక్తిని బలపరిచే చిత్రాలను ప్రోత్సహించేందుకే ఇక్కడకు వచ్చాను. నేను ఓ అవెంజర్ అయి, నాకో టీమ్ ఉంటే అందులో నా ఫ్యాన్స్ ఉండాలని కోరుకుంటాను. ఇండస్ట్రీ వారు టీమ్‌గా ఉండాలనుకుంటే అల్లు అర్జున్, విజయ్ దేవరకొండ, ఆలియా భట్, ప్రియాంకా చోప్రా ఉండాలనుకుంటా. నా మొదటి హీరో మా అమ్మే. ఏడాదిగా ఆమె నా కోసం ఎంతో కష్టపడుతున్నారు'' అన్నారు.

ఆవకాయ తాండ్ర...


● తరుణ్ భాస్కర్


'అప్పడప్పడ తాండ్ర ఆవకాయ తాండ్ర...' అంటూ చిందేశారు దర్శకుడు తరుణ్ భాస్కర్. అజయ్ భూపతి దర్శకత్వం వహించిన 'మంగళవారం' చిత్రంలోని పాట ఇది. పాయల్ రాజ్‌పుత్, అజ్మల్ అమీర్ జంటగా స్వాతీ రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం నిర్మించారు. బి. అజనీష్ లోక్‌నాథ్ స్వరపరచిన ఈ చిత్రంలోని 'అప్పడప్పడ తాండ్ర...' అంటూ సాగే పాటని రిలీజ్ చేశారు. తరుణ్ భాస్కర్, గణేష్ ఎ. రాసిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్ పాడారు. ఈ ప్రత్యేక పాటలో తరుణ్ భాస్కర్ నటించడం విశేషం. ''తరుణ్ భాస్కర్ గెటప్, లుంగీలో డాన్స్ చేయడం ఈ పాట ప్రత్యేకత. కోనసీమలోని ఓ పల్లెటూరిలో చిత్రీకరించిన ఈ పాట పల్లె ప్రజల మధ్య సంభాషణలు, ఊరిలో పరిస్థితులను తెరపై ఆవిష్కరించేలా ఉంటుంది'' అన్నారు అజయ్ భూపతి.

స్వర్గం నరకం ఈశ్వరరావు ఇక లేరు



సీనియర్ నటుడు ఈశ్వరరావు కన్నుమూసిన విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. అమెరికాలోని మిచిగాన్‌లో ఉన్న తన కుమార్తె ఇంటికి వెళ్లిన ఆయన అనారోగ్య కారణంతో అక్టోబర్ 31న తుది శ్వాస విడిచారు. దాసరి నారాయణరావు దర్శకత్వం వహించిన సూపర్ హిట్ చిత్రం 'స్వర్గం నరకం' (1975) ద్వారా వెండితెరకు పరిచయం అయ్యారు ఈశ్వరరావు. ఈ చిత్రంలో తన నటనకుగాను కాంస్య నంది అవార్డును అందుకున్నారు ఈశ్వరరావు. ఆ తర్వాత 'దేవతలారా దీవించండి', 'ప్రేమాభిషేకం, యుగపురుషుడు, దయామయుడు, ప్రెసిడెంట్‌గారి అబ్బాయి, జయం మనదే, శభాష్ గోపి' తదితర చిత్రాల్లో నటించి, ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారాయన. చిరంజీవి హీరోగా కె.రాఘవేంద్ర రావు దర్శకత్వం వహించిన 'ఘరానా మొగుడు' (1992) సినిమాలో చివరిసారిగా కనిపించారు ఈశ్వరరావు. దాదాపు 200కు పైగా చిత్రాల్లో నటించారు. పలు సీరియల్స్‌లో నటించి బుల్లితెర ప్రేక్షకులనూ అలరించారాయన. ఈశ్వరరావు మృతికి పలువురు సినీ ప్రముఖులు సంతాపం తెలిపారు.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్


● వేణుగోపాల్, విక్రమ్ రెడ్డి, 'దిల్' రాజు


హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువేక్ష, మేఘలేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లుగా నటిస్తున్న యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ 'రోటి కపడా రొమాన్స్'. విక్రమ్ రెడ్డి దర్శకత్వంలో వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జం నిర్మిస్తున్నారు. ఈ సినిమా షూటింగ్ 90 శాతం పూర్తయింది. ఈ టైటిల్ లోగో రిలీజ్ చేసిన నిర్మాత 'దిల్' రాజు మాట్లాడుతూ– ''ఈ సినిమా కథ విన్నాను. కొత్త కంటెంట్ ఉన్న చిత్రాలను మన ఆడియన్స్ ఆదరిస్తారు. ఈ చిత్రం కూడా ఇదే కోవలో ఉంటుందని ఆశిస్తున్నాను'' అన్నారు. ''పక్కా యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ ఫిల్మ్ ఇది'' అన్నారు వేణుగోపాల్, విక్రమ్.

ఇరవై ఏళ్లకు నా కల నెరవేరింది
- ఆర్‌పి వెంకట్



''ఒకసారి ఫ్రెండ్స్‌తో కలిసి సినిమా చూస్తున్నప్పుడు నాకు 'దీపావళి' కథ ఆలోచన పుట్టింది. పల్లెటూరు, అక్కడి ఓ ముసలి వ్యక్తి, మనవడు, వారు ప్రేమగా పెంచుకునే మేక పిల్ల.. ఈ అంశాలను కనెక్ట్ చేస్తూ భావోద్వేగాలతో 'దీపావళి' తీశాను'' అని దర్శకుడు ఆర్‌పి వెంకట్ అన్నారు. 'స్రవంతి' రవికిశోర్ తొలిసారి తమిళంలో నిర్మించిన చిత్రం 'కీడా'. తెలుగులో 'దీపావళి' పేరుతో అనువదించారు. పూ రాము, కాళీ వెంకట్ ప్రధాన పాత్రలు పోషించిన ఈ చిత్రం ఈ నెల 11న తెలుగు, తమిళ భాషల్లో విడుదలవుతోంది. ఈ సందర్భంగా చిత్రదర్శకుడు ఆర్‌పి వెంకట్ మాట్లాడుతూ– ''మాది తమిళనాడు. 2003లో చెన్నైలో ఆఫీస్ బాయ్‌గా నా జీవితం ప్రారంభించి, అసిస్టెంట్, అసోసియేట్ డైరెక్టర్‌గా చేశాను. దర్శకునిగా 'దీపావళి' నా తొలి సినిమా. 20 ఏళ్ల తర్వాత నా కల నిజమైంది. రవికిశోర్‌గారి తొలి తమిళ సినిమాకు నేనే డైరెక్టర్ అని చెప్పుకోవటం ఎంతో గర్వంగా ఉంది. నా తర్వాతి సినిమా కోసం ఎమోషనల్ పాయింట్‌తోనే ఓ కథను సిద్ధం చేస్తున్నాను. రవికిశోర్‌గారికి నచ్చింది. ఈ సినిమాని ఓ స్టార్ హీరోతో చేసే ఆలోచనలో ఉన్నాం'' అన్నారు.

తెరచాప ఆడాలి
- విశ్వక్ సేన్


● విశ్వక్ సేన్, నవీన్ రాజ్

నవీన్ రాజ్ సంకరపు, పూజా సుహాసిని ముఖ్య తారలుగా నటిస్తున్న చిత్రం 'తెరచాప'. జోయల్ జార్జ్ దర్శకత్వంలో కైలాష్ దుర్గం నిర్మిస్తున్న ఈ సినిమా టైటిల్‌ను హీరో విశ్వక్ సేన్ విడుదల చేసి, మాట్లాడుతూ– ''టైటిల్ డిజైనింగ్ బాగుంది. ఈ సినిమా కథ, కథనం, టేకింగ్, అన్నీ నాకు తెలుసు. ఈ సినిమా బాగా ఆడి, చిత్ర యూనిట్‌కి మంచి విజయాన్ని చేకూర్చాలని కోరుకుంటున్నాను'' అన్నారు. ఈ చిత్రానికి సంగీతం: ప్రజ్వల్ క్రిష్, కెమెరా: అజీమ్–వెంకట్.

మార్పు కోసం..


● సుమన్

సుమన్, అజయ్ ఘోష్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'జనం'. వెంకటరమణ పసుపులేటి స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ సినిమా ఈ నెల 10న రిలీజ్ అవుతున్న సందర్భంగా వెంకటరమణ పసుపులేటి మాట్లాడుతూ– ''ప్రజలకు మంచి చేయాలని రాజకీయాల్లోకి వచ్చే నాయకులు తప్పుదారి పట్టిన ప్రజల ఓట్ల కోసం, ఎన్నికల్లో గెలవడం కోసం ఎలా తప్పు దారి పడుతున్నారు? అనే నేపథ్యంలో ఈ చిత్రకథ సాగుతుంది'' అన్నారు.

పైరసీకి అడ్డుకట్ట వేస్తాం
- కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్



''పైరసీ కారణంగా ప్రతి ఏడాది వినోద రంగానికి రూ.20 వేల కోట్లు నష్టం వాటిల్లుతోంది. ఓ సినిమా నిర్మాణానికి పడ్డ కష్టం పైరసీ వల్ల వృథాగా పోతోంది. పైరసీని అడ్డుకోవడానికి కేంద్ర ప్రసార, సమాచార మంత్రిత్వ శాఖలో నోడల్ ఆఫీసర్స్‌ను నియమించడం జరిగింది'' అని కేంద్ర ప్రసార, సమాచార శాఖ మంత్రి అనురాగ్ ఠాకూర్ అన్నారు. ఇటీవల సినిమాటోగ్రఫీ చట్టం–1952లో సవరణలు చేసి, కొత్త బిల్లును పార్లమెంట్‌లో ఆమోదించిన విషయం తెలిసిందే. ఇందులో పైరసీని అరకట్టడం అనేది ఓ ప్రధానాంశం. ఈ విషయమై శుక్రవారం అనురాగ్ ఠాకూర్ మాట్లాడుతూ– '' ముంబైలోని సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ కార్యాలయంలో, ప్రాంతీయ కార్యాలయాల్లో పైరసీ, డిజిటల్ పైరసీల ఫిర్యాదులను స్వీకరించేందుకు అధికారులను నియమించాం. డిజిటల్ ప్లాట్‌ఫామ్స్‌లో ఉన్న పైరేటెడ్ కంటెంట్‌పై నోడల్ ఆఫీసర్స్‌కు ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులు 48 గంటల్లో ఆ కంటెంట్‌ను ఆ డిజిటల్ ప్లాట్‌ఫామ్స్ నుంచి తొలగించేలా చర్యలు చేపడతారు'' అని చెప్పుకొచ్చారు.